క్లుప్తంగా

ఐఐటీ విద్యార్థికి అభినందనలు



హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న సందెల భిక్షపతి కుమార్తె సందెల శ్రావ్య.. హిమాచల్ ప్రదేశ్‌లోని ఐఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పూర్వ పాఠశాల యాజమాన్యం (సుజాత విద్యానికేతన్) శ్రావ్యను అభినందించింది. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఆకుతోట రాంబాబు మాట్లాడుతూ శ్రావ్య ఐఐటీలో ప్రవేశం పొందడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నాగరాజు, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్' పుస్తకాల పంపిణీ

హసన్‌పర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన పుస్తకాలను రిటైర్డ్ ఎస్ఈ రాజేంద్రప్రసాద్ సహకారంతో హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ కుల వ్యవస్థను దూరం చేసి సమాజాన్ని స్వేచ్ఛ, సమానత్వం పునాదుల మీద పునర్ నిర్మించిన మానవతావాది డాక్టర్ అంబేడ్కర్ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో రేణుకుంట్ల దుర్గాప్రసాద్, భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నాయకులు కర్రె భిక్షపతి, దళిత సంఘాల నాయకులు రౌతు రమేష్‌కుమార్, మార్గం శంకర్ నారాయణ, నేదునూరి రాజమౌళి, లింగారెడ్డి, నాగరాజు, రేణుకుంట్ల రాజయ్య పాల్గొన్నారు.

నియామకం



హన్మకొండ: బీసీ ఐక్య సంఘర్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా రాచకొండ ప్రవీణ్‌కుమార్‌ను నియమించినట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'శ్వేతార్క'లో ఉత్సవాలు



కాజీపేట: శ్వేతార్క ఆలయంలో పదహారు రోజులపాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సాగే గణపతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆలయ వ్యవస్థాపకుడు అయిన నవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి కోరారు. కాజీపేటలోని శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయంలోని 29 దేవతామూర్తులకు శ్రావణ మాసంలో వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు.

'పుష్‌పుల్'ను పునరుద్ధరించాలి



కాశిబుగ్గ: కాజీపేట – విజయవాడ మధ్య తిరిగే పుష్‌పుల్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని ఉద్యోగులు, చిరు వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ మేనేజర్ బాలరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా పుష్‌పుల్ రైళ్లు రద్దు కావడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్న రైల్వే అధికారులు.. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు అధికంగా ప్రయాణించే పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. లేక్‌వ్యూ బార్ సమీపంలోని కారంపూడి కమలమ్మ ఇంట్లో పేకాట ఆడుతున్న రామన్నపేటకు చెందిన సుంకరి సురేష్, మహ్మద్ యాకుబ్‌బాబా, సొరం కుమారస్వామి, తిరుమల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

సిటీ ప్లానర్‌కు పదోన్నతి

వరంగల్ అర్బన్: రాష్ట్ర టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ హోదాలో గ్రేటర్ వరంగల్ సిటీ ప్లానర్‌గా కొనసాగుతున్న వెంకన్నకు అడిషనల్ డైరెక్టర్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ లేకుండా గ్రేటర్ వరంగల్‌లో కొనసాగాలని ఆదేశాలు ఇచ్చింది. త్వరలో ఆయన పదోన్నతి మీద బదిలీపై వెళ్తారని ప్రచారం జరుగుతోంది.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న మల్లు లక్ష్మి



నినాదాలు చేస్తున్న సుభాషిణి, గుడిసెవాసులు



మడికొండ: నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హసన్‌పర్తి: ఇళ్లు లేక సర్కారు స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియ దావలే డిమాండ్ చేశారు. నగరంలోని గోపాలపురం, భీమారంలో చెరువుల్లో వేసుకున్న గుడిసెలను మరియ దావలే సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మరియ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం నేటివరకూ నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్రం రూ.5 లక్షల చొప్పున విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ 58 జీఓ ప్రకారం పేదలు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఆల్ ఇండియా కార్యాలయ కార్యదర్శి షాబానా, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, జిల్లా నాయకులు ఎల్.దీప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాములు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్, నాయకులు సుచందర్, అంబాల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఐక్యతతో ఇళ్ల స్థలాలు సాధించుకోవాలి

కరీమాబాద్: పేదలు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వాల మెడలు వంచైనా ఇళ్ల స్థలాలు సాధించుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ సూచించారు. గ్రేటర్ పరిధిలోని జక్కలొద్దిలో పేదలు వేసుకున్న గుడిసెలు, ఇళ్లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 9ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు కట్టివ్వలేదని ఆరోపించారు. పేదలు అధైర్య పడొద్దని, సీపీఎం ఎర్రజెండా అండగా ఉంటుందని చెప్పారు. దేశంలోనే జక్కలొద్ది భూపోరాటం ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి రంగయ్య, రత్నమాల, సాగర్, సాంబమూర్తి, సందీప్, చందు, శివ, అనిల్, రాజు, కోటన్న, షరీఫ్, పూర్ణచందర్, రఘుపతి, విజయ్‌కుమార్, ఉపేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

మడికొండ: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ నాయకులు విమర్శించారు. మడికొండ శివారులోని రాజన్నబండలో గుడిసెలు వేసుకున్న పేదలకు 58జీఓ ప్రకారం పట్టాలివ్వాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల సహాయ కార్యదర్శి మాలోతు శంకర్, భూపోరాట కమిటీ నాయకులు లావణ్య, కోరపెల్లి రమాదేవి, గంగారపు మాధవి, పూర్ణచందర్, రమేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలు చదవడం అలవాటు చేసుకోవాలి



కరీమాబాద్: మాట్లాడుతున్న కార్పొరేటర్ రవి



మడికొండ: పఠనం చేస్తున్న విద్యార్థులు

కరీమాబాద్: విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దుర్గం రవి అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ రవి హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాలతోపాటు గ్రంథాలు కూడా చదవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలిక సంరక్షణ మాజీ చైర్మన్ మండల పరశురాములు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడికొండ ఎంపీపీఎస్‌లో..

మడికొండ: మడికొండ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మల్లారెడ్డి అధ్యక్షతన సోమవారం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తకాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల గ్రంథాలయానికి విద్యార్థుల తల్లిదండ్రులు పుస్తకాలను బహూకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రమేష్‌బాబు, రాజేశ్వరి, వేణుగోపాలు, హైమావతి, కమల, రమ పాల్గొన్నారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్లకు అభినందనలు



వీసీ, రిజిస్ట్రార్లను అభినందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. దాంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, జనరల్ సెక్రటరీ ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు మధుకర్‌రావు, అనిల్‌కుమార్, వీణ, చందులాల్ సోమవారం అభినందించారు. అలాగే, వీసీ, రిజిస్ట్రార్‌లను మరో కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ గోపినాథ్ సన్మానించారు. కేయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును దూరవిద్య కేంద్రం ఉద్యోగుల సంఘం బాధ్యులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శాగంటి శ్రీనివాస్, డాక్టర్ ఎఫ్రిమ్‌రాజు, నాయకపు ప్రవీణ్, గటిక కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల చేయూత



రామన్నపేట: విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న వాసవి, మహీంద్ర ప్రతినిధులు



కాజీపేట అర్బన్: విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రామన్నపేట: వరంగల్ ఏవీవీ విద్యార్థులకు వాసవి క్లబ్, కొటక్ మహీంద్ర పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లను సోమవారం పంపిణీ చేశారు. పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థ శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, వాసవి క్లబ్ బాధ్యులు వెంకటనర్సయ్య, బ్యాంకు ప్రతినిధులు సత్యనారాయణ, కరుణాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 11 రకాల స్టేషనరీని సోమవారం అందజేశారు. అమెరికాలో నివాసముంటున్న ప్రవాస భారతీయ దంపతుల కుమారుడు శ్రేయాన్స్ జన్మదినం సందర్భంగా స్టేషనరీ అందజేసినట్లు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రామకృష్ణ తెలిపారు. భవిష్యత్‌లోనూ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు దేవమణి, రవీందర్‌రాజు, చంద్రమోహన్, నరేందర్, భాస్కర్, పుష్పలత, కిరణ్‌కుమార్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢమాస సంబరాల్లో మేయర్



గోరింటాకు వేడుకల్లో మేయర్, తదితరులు

వరంగల్ చౌరస్తా: ఆషాఢ మాస సంబరాల్లో నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. వరంగల్ రామన్నపేటలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ మిత్రురాళ్లతో కలిసి మేయర్ హాజరయ్యారు. యశోద, స్వర్ణ, వనజ, విజయ, శోభ, సుజాత, బి.లక్ష్మి, సరస్వతి, నర్మద, శశి, విజయ, తిరుమల, నీరజ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట పోచమ్మగుడి ప్రాంతంలో పట్టణ ప్రగతి నిధులు రూ.40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నగర మేయర్ గుండు సుధారాణి క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మేయర్‌ను కలిసి డ్రెయినేజీ నిర్మించాలని, పబ్లిక్ నల్లా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, డీఈ రవికిరణ్, ఏఈ ముజామిల్, టీఎంసీ రమేష్, సీఓ సుజాత, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఏరియాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కిట్స్‌క్రాస్, ఎర్రగట్టు గుట్ట, నారాయణనగర్, మంత్రపురి కాలనీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతులు, లైన్ షిఫ్టింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేను ఆదేశించినా స్పందించవా?

కాంట్రాక్టర్ తీరుపై ఈఈ రాజయ్య ఆగ్రహం



అధికారులకు సమస్యను విన్నవిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ అర్బన్: దర్గా 100ఫీట్ల రోడ్డులో అభివృద్ధి పనుల పేరుతో ఆదర్శకాలనీలోని సీసీ రోడ్డును మూడు నెలల క్రితం తవ్వి కాలనీవాసులు నడిచేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు. దాంతో పనుల జాప్యంలో కాంట్రాక్టర్‌పై స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను వారం క్రితం అధికారులు ఆదేశించారు. అయినా పనులు చేపట్టకపోవడంతో మళ్లీ స్థానికులు ఫిర్యాదు చేయగా కాలనీని మున్సిపల్ ఈఈ రాజయ్య, డీఈ సంతోష్, ఏఈ శ్రీకాంత్, కార్పొరేటర్ మానసరాంప్రసాద్ సోమవారం సందర్శించి రోడ్డును పరిశీలించారు. ఈక్రమంలో కుంటిసాకులు చెప్పే ప్రయత్నం చేయడంతో కాంట్రాక్టర్‌పై ఈఈ రాజయ్య ఆగ్రహించారు. పనులు మొదలు పెట్టాలని తాను ఆదేశించినా స్పందించవా అని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని స్థానికులు తెలిపారు.

సంకల్ప రథయాత్రకు మద్దతివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

హన్మకొండ అర్బన్: పాత పింఛన్ విధానం సాధన కోసం సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు టీఎన్జీవోస్ నాయకుల పూర్తి మద్దతు, సహకారాలు ఉండాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజేందర్, బైరి సోమయ్యను సీపీఎస్ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో టీఎన్జీవోస్ నాయకులను సోమవారం కలిసిన వారి మద్దతు కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ సీపీఎస్ అంతానికి టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిడ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ నాయకత్వంలో జిల్లా కమిటీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు.

పెరిగిన కూరగాయల ధరలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న మహిళలు, నాయకులు

వరంగల్ చౌరస్తా: పెరిగిన కూరగాయల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సంఘం నాయకులు విమర్శించారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి మాట్లాడుతూ వారం రోజులుగా దేశంలో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయని వాపోయారు. దాంతో పేద, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనలేని దుస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వాలు చొరవ తీసుకొని పెరిగిన ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, స్వాతి, అనుష, చరణ్, రాజేష్, చిరంజీవి, బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 15న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్న ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో 60శాతం టికెట్లు ఇవ్వాలని పేర్కొన్నారు.

4నుంచి 6వరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ

న్యూశాయంపేట: ఆగస్టు 4నుంచి 6వ తేదీ వరకు హనుమకొండలో జరగనున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ పిలుపునిచ్చారు. నగరంలోని రాంనగర్ సుందరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి, ఉపాధ్యక్షుడు మంద సుచందర్, సహాయ కార్యదర్శులు మంద సురేష్, ఓర్సు చిరంజీవి, చిట్యాల విజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మౌనిక, సలీంరాజు, చిలుక జంపయ్య, అశోక్, చామంతి, దేవేందర్ పాల్గొన్నారు.

భట్రాజులందరు ఐక్యంగా ఉండాలి

కాశిబుగ్గ: భట్రాజు కులస్తులందరు ఐక్యంగా ఉంటూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగాలని భట్రాజు కులవాసి జగిత్యాల డీఎస్పీ కూరపాటి రాజశేఖర్‌రాజు సూచించారు. తెలంగాణ భట్రాజు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోనుగంటి దయాకర్‌రాజు అధ్యక్షతన కాశిబుగ్గ స్టాండర్డ్ హైస్కూల్‌లో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ భట్రాజు సంఘం రాష్ట్ర స్థాయిలో బలోపేతమయ్యేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కృపాకర్‌రాజు, సలహాదారులు డాక్టర్ జయవీర్‌రాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యా కుసుమానికి ఆర్థికసాయం

ఖిలా వరంగల్: నిరుపేద ఆటో డ్రైవర్ బిడ్డకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అండగా నిలిచారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్, ఆయన భార్య దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారి కుమార్తె అడప సౌమ్య ఎంబీబీఎస్‌లో రాష్ట్రస్థాయిలో 461 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచింది. అయితే సుమారు రూ.60వేలకు పైగా ఫీజు చెల్లిస్తేనే చేతికి సర్టిఫికెట్లు వచ్చే పరిస్థితి నెలకొంది. దాంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ తీసుకెళ్లారు. దాంతో ఎమ్మెల్యే ఆర్థిక చేయూతనందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో సుధాకర్, రమణారెడ్డి, శివ, కిట్టు, కుమారస్వామి, కొంతం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు



హన్మకొండ: ప్రజాహిత కార్యక్రమాలు చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్‌రెడ్డి బుసిరెడ్డి అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్‌వీ.కన్వెన్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ హనుమకొండ 24వ ఇన్‌స్టాలేషన్ సెర్మనీ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పూర్వ జిల్లా గవర్నర్ టీవీఆర్.మూర్తి, జిల్లా గవర్నర్ శంకర్‌రెడ్డి బుసిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి కేవీఎస్.శిరీష్‌కుమార్, కోశాధికారి జి.నరేష్‌తో పూర్వ జిల్లా గవర్నర్ టీవీఆర్.మూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యుడు కాయిత ఇంద్రసేనారెడ్డి అందించిన 10 వీల్‌చైర్‌లను దివ్యాంగులకు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు మల్లాజి వాసుదేవ్, డాక్టర్ శరత్ బాబు, ఎస్.మనోహర్ రెడ్డి, కోడెల సురేందర్ రావు, డి.శ్రీనివాస్, సందసాని నరేష్, బేతి రవీందర్ రెడ్డి, మాదాల సతీష్, అన్నం మంజుల, డి.రమ, బి.కన్నారెడ్డి, వంగ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: నగరంలోని ఒకటో డివిజన్ ముచ్చర్లలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ నరసింహ ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బాలవికాస సాంఘిక సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ రమ మాట్లాడుతూ సీజన్ వ్యాధులపైప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అనూష, నిఖిల్, రూప, పద్మ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ సంపత్‌కు సన్మానం

కాశిబుగ్గ: 19వ డివిజన్ ఓసిటీ వీరాంజనేయ, కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన కంచ సంపత్‌ను కురుమ కుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కురుమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచు ప్రభాకర్ మాట్లాడుతూ కురుమ కులస్తుడు కంచ సంపత్ ఆలయ చైర్మన్‌గా ఎన్నికావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కోరె రవి, మండల నర్సింహులు, దయ్యాల ప్రభాకర్, గౌడ నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మడికొండ: తాటిచెట్టుపై నుంచి కిందపడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మడికొండలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన వడ్లకొండ రఘు(35) రోజువారి వృత్తిలో భాగంగా చెట్లు ఎక్కేందుకు ఆదివారం వెళ్లాడు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి పోయాడు. దాంతో రఘు పక్కటెముకలు విరిగాయి. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

స్వయంభూ ఆలయంలో పూజలు

ఖిలా వరంగల్: ఆషాఢమాసం సందర్భంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శంభులింగం ఆధ్వర్యంలో శంభులింగేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో రాజేష్, బోరిగం నర్సింగం, భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

కాశిబుగ్గ: అష్టమిని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలోని కాలభైరవుడికి సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య కాలభైరవుడికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

మల్లన్నకు సహస్ర అలంకరణ పూజలు

కాజీపేట: ఆషాఢమాసం రెండో సోమవారం సందర్భంగా కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో దేవతామూర్తులకు మహారుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులతో కలిసి మల్లన్నకు సహస్ర పుష్పాభిషేక పూజలు జరిపించారు. దేవాలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పండితులు పూలతో ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. శ్రావణ మాసంలో వచ్చే పూజలు, విశిష్టతలను భక్తులకు పండితులు రేపాక శ్రీనివాస్‌శర్మ అనుగ్రభాషణం చేశారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

వరంగల్: మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని పోలీసులు తెలిపారు. ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏనుమాములలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు.

చర్య తీసుకోవాలని ఫిర్యాదు

ఖిలా వరంగల్: జనసేన అధినేత, సినీహీరో పవన్‌కల్యాణ్ వ్యక్తిగత జీవితం, ఆయన కుటుంబ సభ్యుల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ తాళ్లపెల్లి బాలుగౌడ్ కోరారు. ఈమేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాజేందర్, ప్రేమ్, యశ్వంత్, టైసన్, రాజేష్, కిట్టు, జగన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.